# బరువైన సత్యాలు

ఎక్స్‌ప్రెస్ బస్ ఊరు చేరేసరికి బాగా పొద్దు పోయింది. అమ్మ ఎదురుచూస్తున్నది నాకోసం ఎంతో ఆత్రంగా. ఇక అప్పుడు అన్నం తినమని బలవంతపెట్టినా తినకుండా పడుకున్నాను. అందుకే గాబోలు పొద్దున్నే మామూలుగా నిద్రలేవలేకపోయాను. కాని మెళుకువ గానే ఉన్నాను. అమ్మచేసే ఆర్భాటము, సందడి అంతా పరధ్యానంగా చూస్తూనే ఉన్నాను. వింటూనే ఉన్నాను. మాకు పాతికేళ్ళనుంచీ పాలు పోస్తున్న లక్ష్మీదేవమ్మ తయారైంది పొద్దున్నే.

"ఇదిగో, ఈ నెలరోజులూ చిక్కని పాలు తేవాలి. అమ్మ డొచ్చింది రాత్రి తెలుసా. చవిలేని కూరలు. రుచిలేని పాలు. పిల్ల ఎన్న డైనా ఎరుగునా? పట్నవాసాల్లో ఎట్లాగూ తప్పదు. నీళ్ళు కలిపావా-నీకు వొక్క పైసాగూడా ఇవ్వను" అని అంటూ తన మనసులో కూతురు ఇన్నాళ్ళకు వచ్చిందన్న సంతోషాన్ని ఎట్లా వ్యక్తం చేయాలో తెలీక తబ్బిబ్బవుతోంది అమ్మ.

"ఓయ్ చెప్పవూ. సరోజమ్మ వచ్చిందా. ఇకనేం, పెరుగుకూడా పట్టుకొస్తా. ఏవమ్మోయ్, అమ్మాయి గోరూ" అంటూ కేకలేసింది లక్ష్మీందేవమ్మ. లక్ష్మీందేవమ్మ అంటే నాకు చాలా ఇష్టం. నా చిన్న తనాన పెరుగుతెచ్చినప్పుడల్లా, పెరుగు గిన్నెలో పోసిం తర్వాత రోజూ నా చేతిలో పెరుగు పెట్టేది. వాళ్ళ పొలాల్లోని చామంతిపూలూ, బంతిపూలూ తెచ్చి ఇచ్చేది. సజ్జకంకులూ, పెసరకాయలూ సరేసరి. నేను పుట్టటం ఎరుగును. పాకటం ఎరుగును. పారాడటం ఎరుగును.

మా ఊరికి మూడుమైళ్ళదూరంలో వాళ్ళ పల్లె. వాళ్ళపల్లెకు కూడా నేను ఐదారు సార్లు వెళ్ళాను. ఎందుకో నేనంటే లక్ష్మిందేవమ్మకు కూడా వల్లమాలిన ప్రేమ. నా పెళ్ళికి కూడా వచ్చింది. ఆ మూడు పూటలూ మా యింట్లోనే భోజనం చేసింది. పాన్పునాడు వచ్చి ఎక సక్కాలు, పరాచికాలూ ఆడింది. నేను అత్తవారింటికి వెళ్ళిపోతున్నానని కళ్ళనీళ్ళు పెట్టుకొంది. ఆ తరువాత ఎప్పుడైనా పుట్టింటికి వచ్చి నప్పుడు మా వారిని గూర్చి ఎన్ని కబుర్లో అడిగేది. తన కర్థంకాక పోయినా ఉద్యోగము, చదువు, సంపాదనా, అలవాట్లు అవన్నీ తన కెందుకనుకోకుండా నేను చెప్పేదాన్ని. అందుకే నేనంటే అమిత ఇష్టం. పాలబాకీ సంబంధంగా ఏవైనా హెచ్చుతగ్గులు వస్తే మా అమ్మ గంయ్‌మని పోట్లాడేది. 'మీరుండండి అమ్మగారు. బుల్లెమ్మ గోరు చెపు తుంది' అని నేను చెప్పినట్లుగా లెక్క ఒప్పుకునేది.

లక్ష్మిందేవమ్మ కేకలకు నేను కదలలేదు. మా అమ్మ మంద లిస్తున్నది. "రాత్రి సరిగా నిద్రలేదు. పడుకోనీ.ఇంకా నెల్లాళ్ళు ఉంటుం దిలే. అల్లుడుగారు నెల్లాళ్ళు ఉంచేందుకు ఒప్పుకున్నారు. ఏమిటి నీ తిరణాల కేకలు?"

లక్ష్మిందేవమ్మ రహస్యంగా బతిమాలుకుంటున్నట్లు అడుగు తున్నది. ఎంత రహస్యంగా అడుగుతున్నా నాకు వినపడకపోలేదు. ఏమో నాకు తెలీదు అంటున్నది అమ్మ. మొదట్లో అమ్మను చూసినా, నాకు చిరాకూ చీదరా ముంచుకొచ్చేవి. ఇప్పుడు కూడా ఆ విషయమే అడిగినట్లున్నది అమ్మను- "నీళ్ళోసుకున్నదా!"

"ఆ! హాయిగా బతక్కుండా పిల్లా, పీచూ గందరగోళం. ఇప్పటినుంచే ఎందుకంట. జానెడు జానెడు కొంపలు. మండిపోయే ధరలు. ముద్దూ ముచ్చటా తీరకుండానే 'కావు' మంటూ తయారు.

ఏం ముంచుకొనిపోయిందిప్పుడే. ముసలైనారా! ముతకైనారా! ఏడేళ్లేగా అయింది. శంకరనారాయణగారి పెద్దమ్మాయికి పదకొండేళ్ళ తరవాత గాని పిల్లలు పుట్టలేదు. వరసాగ్గా నలుగురు పుట్టారు తరవాత." అంటే ఇప్పుడే నాకు పిల్లలుపుట్టడం ఇష్టంలేనట్లుగా అమ్మ మాట్లాడుతూ ఉంటే నాకు దిగులూ, నవ్వూకూడా వచ్చాయి.

"ఏవమ్మో బుల్లెమ్మగోరూ, పట్నంలో గూడా ఇంత పొద్దెక్కి నిద్రలేస్తావా ఏంటి! ఆఫీసులకి ఎనిమిది గంటలకే తయారుకావా లటగా?" అని నన్ను చూడాలన్న ప్రేమకొద్దీ గొంతు పెద్దది చేసింది లక్ష్మిందేవమ్మ. నే లేచి వరండాలో కొచ్చాను. నన్ను చూడగానే మొహాన కొట్టవచ్చినంత సంతోషం. ఆపై తానల్లుకొన్న ఊహలు నిజం కాక పోయెనే అన్న ఆశాభంగమూ కలిగాయి లక్ష్మిందేవమ్మ మొహంలో.

"ఆంజనేయులకి పదక్షనాలు చెయ్యి. చూడమ్మాయ్, నలభై రోజులు. నా మాట ఇను" అని దిగులుబడింది. "చిక్కినావు సరోజమ్మ" అని ఆపేక్షంతా కుమ్మరించింది. "మద్దినాళ వస్తాను. ఏం కొత్త సొమ్ములు చేయించుకొన్నావో, ఏటి కొత్తసీరలు కొనుక్కున్నావో సూపిద్దువు." తట్ట నెత్తికెత్తుకుంది. లక్ష్మిందేవమ్మ చాలా ముసలిదై పోయింది. నాకు చాలా దిగులైంది.

'చాలా పెద్దదైపోయిందమ్మా!' అన్నాను. ఆ మాట అన్నతర్వాత అమ్మకూ దిగులైంది. గబగబా ముఖం కడుక్కున్న తర్వాత అమ్మ ఇచ్చిన కాఫీ తాగుతుంటె ప్రాణంలేచి వచ్చినట్లనిపించింది. ఇలాటి కాఫీతాగి ఎన్నేళ్ళయిందో. మా ఊరంటే నాకు చాలా ఇష్టం. అక్కడి ఎండ. అక్కడి చలి. అక్కడ ఉదయించే సూర్యుడు. అక్కడి సంధ్య వేళలు ఎంత బావుంటాయో మరీ మరీ. ఊరొదిలి పెట్టింతర్వాత అవి నాకు మరీ చాలాఇష్టమైనయ్. ఎందుకంటే అవి నాకు లేవు కనక. ఈసారి

మూడేళ్ళతరవాత వచ్చాను మా వూరికి. నా పెళ్లై ఎనిమిదేళ్ళు నిండుతున్నాయి. అలా అనుకోవటం ఇష్టంలేక ఒక ఏడు తగ్గించి అమ్మ సంతృప్తిపడుతున్నది. మొదటి రెండు మూడేళ్ళు ఆయనగారు కూడా నాతోపాటే వచ్చేవారు. ఏ పది రోజులో, పదిహేను రోజులో గడిపి పోయేవాళ్ళం. ఆయనగారికి ప్రమోషన్ వచ్చింతర్వాత, శెలవలు లేకుండా పోయినయ్. నాకు శాంతి లేకుండా పోయింది. ఆయనకు విపరీతమైన అలవాట్లయినాయి. పెద్ద పెద్ద ఆఫీసర్లంతా అంతేనట. లేకపోతే చిన్నతనమట.

మావేప చెట్టుకింద, కాగుకింద మంచేసి, ఆ కాగునిండా నీళ్ళు మొత్తంగా పోసుకుంటూ వుంటే, మా అమ్మ నేను చిక్కిపోతున్నానని ఆపేక్ష ఒలక బోస్తూ వుంటే నా మనసు ఆనందలోకాల్లో విహరిస్తూ ఉంటుంది. నాదగ్గరవచ్చి వుండమంటే మా అమ్మ పట్టుమని పదినాళ్లైనా ఉండలేదు. ఆవిడకు మడీ దడీ చాదస్తం. అదీకాక పిల్లలైనావుంటే కట్టిపడేసినట్లుండేదేమో! పైకి చెప్పదుగాని, ఆమెకూ మనసునిండా కనపడని దిగులు - అసలు పిల్లలు పుడతారో పుట్టరో నాకని. తలంటి పోస్తానన్నది. ఉంటాగా పదిరోజులో, పదిహేను రోజులో అని అప్పుడే విసుక్కోవటం ప్రారంభించాను. నేను అందరిలో చిన్నదాన్ని. మాఅక్క ఎక్కడో దూరంగా ఉంటున్నది. మా అన్నయ్యదగ్గర అమ్మ ఉండలేదు. కోడలిమీద ఎన్నో ఫిర్యాదులున్నాయి. అవన్నీ నేను సావధానంగా వినాలి ఇక్కడున్నన్ని రోజులూ. నాకు తెలుసు. అందువల్ల కాలు, చేయి ఆడుతున్నంత వరకు ఒకరిదగ్గర ఎందుకుండాలని,వూళ్ళోనే ఉండిపోయింది. కొడుకు, కూతురు ఇంటికివస్తే సంబరం. ఆ నాలుగురోజులు ఒకటే గంద్రగోళం చేస్తుంది.

స్నానం చేసిన తర్వాత, పాత వార పత్రికేదో కనపడితే చదువుతూ కూచున్నాను. పక్కింటి వాళ్ళింటి నుంచి తీసుకొన్నట్లుంది అమ్మ.

'ఏమేవ్, వాళ్ళ సంధ్యావళి వచ్చిందేవ్ పుట్టింటికి. రాములవారి కోవెలలో వాళ్ళమ్మ కనిపించి చెప్పింది. ఒకసారి వచ్చి చూసిపొమ్మంది. మా సరోజ వస్తుందని చెప్పాను. వాళ్ళ నాన్నగారి కి మధ్య సుస్తీగా వుంటోంది. చూడటానికి వచ్చింది. మొన్నకాబోలు వీధిలో వెళుతుంటే చూశాను.

ఎంతమంది సంధ్యకు పిల్లలు? అని అడిగాను.

'ముగ్గురు పండ్లలాటి వాళ్ళు,దానదృష్టం మంచిదేనమ్మా. రెండో సంబంధానికిచ్చినా, కడుపు పండింది. వాళ్ళాయన కూడా బాగా చూస్తాట్ట' అని ఉత్సాహంగా చెప్పి దిగులుగా నావేపు చూసి ఆగి పోయింది.

నా మనస్సులో చాలా అసూయ కలిగింది. ఒకవైపు పాపం, దాని జీవితంలో ఆ మాత్రమైనా సుఖశాంతులు కలిగాయి కదా అన్న తృప్తి కలిగింది. సంధ్యావళి పెళ్ళి కావడం ఎటువంటి గడ్డు పరిస్థితిగా తయారయిందో నాకు తెలుసు. ఎన్నాళ్ళకూ కాలేదు. ఇక కానే కాదను కున్నారు. నేను కొత్తలో మా వారితో ఊరికి వచ్చినప్పుడల్లా నన్ను చూట్టానికి వచ్చేది. నా కొత్తచీరలు చూపిస్తూ ఉంటే దాని కళ్ళలో కనపడే ఆసక్తి, కోరిక చూసి నా కళ్ళు చెమ్మగిలేవి. ఒకటి తీసుకో అని ఇద్దామని ఎంతో ఆవేశం కలిగేది కాని, ముఖం చిన్నపుచ్చుకుం టుందో, కళ్ళనీళ్ళు పెట్టుకుంటుందో అని భయపడేదాన్ని. వాళ్ళు నలు గురు ఆడపిల్లలు, ముగ్గురు మొగపిల్లలు. అందరిలోకి అది చిన్నది. అప్పటికే వాళ్ళ అమ్మ, నాన్నవాళ్ళు పెద్దవాళ్ళైపోయినారు. ఇక ఆ పిల్లకు పెళ్ళి కాదనుకొన్నారు. నాకు సంధ్యతో చిన్నప్పటినుంచీ ఎంతో స్నేహం ఉండేది. కలిసే స్కూలుకు వెళ్ళేవాళ్ళం. స్కూలు కబుర్లు, మగపిల్లల అల్లర్లు, రహస్యంగా చెప్పుకొనేవాళ్ళం. ఎక్కడో దూరంగా వాళ్ళు మాకు బంధువులు కూడా అవుతారు.

సంధ్య పుట్టింటికి వచ్చిందనగానే నాకు చాలా సంతోషమైంది. ఎందుకంటే, ఇక్కడ నే నున్న పది పదిహేనురోజులూ ఇక నాకు తోచదన్న దిగులుండదు. ఆవాళ మధ్యాహ్నం భోజనం చేసి కాసేపు నడుం వాల్చిన తర్వాత సంధ్య వాళ్ళింటికి వెళ్ళాను. సంధ్యకు ముగ్గురు మొగపిల్లలు. నిజంగా చాలా ముద్దొస్తున్నారు. అమ్మ చెప్పినట్లుగానే పళ్ళలాగా ఉన్నారు. నాకు వాళ్ళను చూడగానే అణచుకోలేని ఈర్ష్య కలిగింది. నా పెళ్ళయిన రెండేళ్లకు దాని పెళ్ళయింది. పెద్ద పిల్లాడికి ఐదో ఏడుట. రెండోవాడికి మూడో ఏడు. పసివాడికి ఏడాది వెళ్ళింది. తప్పటడుగులు వేస్తున్నాడు. పెద్దాడు నన్ను చూడగానే తన కెంత చదువొచ్చో నాకు తెలియాలని, కూనిరాగాలు తీస్తూ, పాఠాలు, పద్యాలు మొదలెట్టాడు. పసివాణ్ణి ఎత్తుకొని నావొళ్లో కూచోబెట్టుకొంటే, ఆరేళ్ళ క్రితం నా కొత్త చీరలు చూసినప్పుడు సంధ్యావళి కళ్ళలో కనపడ్డ ఆతృత, ఆతృతను మించిన అసూయ, కుళ్ళుబోతుతనం నా కళ్లలో ఇప్పుడు దానికి కనపడుతున్నాయేమో మరి! మా యిద్దరిలో ఎవరు నిజంగా అదృష్టవంతులని నా మనస్సు పదే పదే గుచ్చి గుచ్చి నన్నడిగింది. దాన్ని ఏభై ఏళ్ల రెండో సంబంధం ప్లీడరుగారి కిస్తున్నా రంటే జాలితో, దుఃఖంతో, ప్రపంచం మీద కసి, కార్పణ్యాలతో నా మనస్సు కరిగిపోయింది. హృదయమంతా శూన్యమైపోయినట్లుగా ఆవాళ బాధపడ్డాను. సంధ్య మొహం చూడాలంటే, పలకరించి కులాసాగా మాట్లాడాలంటే, చాలా ఏడుపు వచ్చేది. విధిని, అదృష్టాన్ని, కర్మను నమ్మాలా? లేక ఏవీ నమ్మకూడదా? ఈ ఎనిమిదేళ్లలో నా చుట్టుపట్ల ప్రపంచాన్ని చూసి, నా కళ్లముందు కొచ్చిన మనుషులను చూసి, నేను ఎన్నెన్ని విషయాలో, ఆశ్చర్యంగా నేర్చుకొన్నాను. పెద్ద చదువు చదివి చిన్నబుద్ధులున్నవాళ్లను తాగుబోతులను, అనుమానపు మనుషులను, పెద్ద ఉద్యోగాలు చేస్తూ, దుర్మార్గంగా బతుకుతున్నవాళ్లను, చేయకూడని పాపాలు చేసేవాళ్ళను, ఆడవాళ్లను కొట్టేవాళ్లను, అబద్ధాలు తప్ప మాట్లాడని వాళ్ళను- అంతవరకూ ఎందుకు, మా ఇంటి పక్క శ్యామలను రెండు మూడు రోజుల కోసారైనా వాళ్ళా

యన కొట్టేవాడు. జీతాలు చాలని చిన్న ఉద్యోగస్థులు, తిట్లు, బెదిరింపులు, అభిశాపాలు, రోగాలు, రొష్టులూ, జీవచ్ఛవాల్లా బ్రతికే ఆడా మగా, పనికిరాని పిల్లలు, జీవితంలో ఏమిటి మాధుర్యం! అని కంఠగత ప్రాణుల్లా బతికేవాళ్లను ఎంతమందినో చూశాను నేను.

అసూయ నిండిన మనస్సుతో నే నింటికి వచ్చాను. ఇంట్లో అమ్మా, నేనూ. ఇల్లంతా నిశ్శబ్దం తాండవిస్తున్నట్లుగా, మనసంతా సంధ్యావళిపైకే పీకుతున్నది.

'చలిజ్వరము ఎందువలన వచ్చును. అంగడి మిఠాయి ఎందుకు తినరాదు. ఆరోగ్యముగ ఉండుటకు ఏమి చేయవలెను' అని కూడ బలుక్కొని సంధ్యావళి పెద్దపిల్లవాడు చదివిన పాఠం చెవిలో వినపడుతున్నది. మర్రోజు సంధ్య వచ్చింది పసివాణ్ణి ఎత్తుకొని. పెద్దపిల్లలను తీసుకొని రానందుకు నేను కసురుకున్నాను. ఆమాటా ఆమాటా చెప్పుకొన్న తర్వాత, నీ సంసారం చాలా ముచ్చటగా ఉంది అన్నాను నేను దానితో. సంధ్య కన్నీళ్ళ పర్యంతమైంది. దాని బాధ ఏమిటో నేను అర్థం చేసుకోలేక పోయాను.

'సుకుమారమైన భావాలు, అలకలు, అసూయలు నాకుమాత్రం ఎందుకుండవని నీవనుకోవాలి. జీవితం పట్ల ఆశలు, ఆకర్షణలు నాకు మాత్రం ఉండకూడదా! నేను జీవితం ఏమనుభవించాను?'

నేను నోరు నొక్కుకొని మూగలాగా ఉండిపోవాల్సి వచ్చింది. తనకన్నా ఇరవై ఏళ్లు భర్త పెద్దవాడు కావటం తప్ప. జీవితంలో సంధ్యకు, నాకు తెలిసినంత వరకూ ఏలోటు లేదు. తిండి తిప్పలకు బాధపడే కుటుంబం కాదు. ఇక మానసికమైన ఉద్రేకాలు, ముద్దుమురిపాలు, సమాన వయస్కుల్లో మాత్రం అందరిలోనూ తీరుతున్నాయా? జీవితంలో అడుగడుగునా ఎన్ని అవరోధాలు, అసంతృప్తులు, ఆశాభంగాలు! మా ఇంటిపక్కవాళ్ల పాపకు కాలు కుంటిదై పోయింది. ఈ వేపున ఉండే వాళ్ళకు కడుపు నిండా తినటానికి తిండిలేదు. మా ఇంటి ఎదురుగా ఉన్న అతడు - ఇంజనీరు. నేతిబీరకాయలాగ,

ఉద్యోగానికేం, ఉద్యోగం మంచిదే. తాగుబోతు. భార్యని భార్యగా చూడనేలేడు.

ఇవన్నీ వివరంగా కూచోబెట్టుకొని సంధ్యావళికి చెపుదామని ఎప్పటి కప్పుడు అనుకుంటూ వచ్చాను నే నక్కడ ఉన్న పదిహేను రోజులు. చివరకు సంధ్యకు నా సంగతి కూడా చెపుదామనుకొన్నాను, నాతో నీ జీవితాన్ని పోల్చుకొమ్మని. కాని నాకెందుకో భయమేసింది. తనని చూసి నేను ఈర్ష్యపడుతున్నానని తనకెందుకు తెలియాలి

పదిహేనురోజు లుండేటప్పటికే మొహం మొత్తినట్లనిపించింది. అనుకోంది ఆయనగారు ఉత్తరం కూడా వ్రాశారు, వెంటనే వచ్చేయ మని. తమ తిరుగుళ్లు, షికార్లు, క్లబ్బులు, విందులు, అన్నీ అమరికగా ఉండటంలేదు కాబోలు!

నేను పట్నం వచ్చేశాను. ఆ తరువాత పది రోజులకు అమ్మ దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. సంధ్య మగడు, అదివరకే జబ్బు చేసిందట- పాపం, పోయాడని. నాకు దుఃఖం ఆగలేదు. ఈ జీవితంలో ఎవరి గురించి ఎవరు అసూయపడటం ఎందుకో అనిపించింది. సుఖ దుఃఖాలు కలగా పులగంగా అందరి జీవితాల్లోనూ ఉండేవే. ఆవాళ రాత్రి ఎంత పొద్దుపోయినా మావారి కోసం మేల్కొని ఉండి, ఆయన రాగానే ఎదురుగా పోయి మెడచుట్టూ చేతులు వేశాను. ఆయన అను నయంగా నన్ను హత్తుకున్నారు. నా కన్నీరు ఆయనకు అర్థం కాలేదు. ఆయన కన్నీరు పెట్టుకొంటే ఎందుకో నాకు అర్థం కాలేదు. ఆఫీసులో పనిచేసే అతడు కొత్తగా చేరిన ఇంజనీరు, పాతికేళ్లుంటాయో ఉండవో యాక్సిడెంట్ అయి హాస్పిటల్‌లో పోయాడట, అదీ ఆలస్యం. ఆయన చెప్పారు.

సంధ్యావళి నా కళ్లలో మెదిలింది.

మావారిని మరీ హత్తుకొనిపోయినాను.

ఏది అదృష్టమో, ఏది దురదృష్టమో ఎవరు నిర్ణయిస్తారు?

(స్రవంతి - 1972)